క్లుప్తంగా

అండగా ఉంటాం..

మణుగూరుటౌన్: అరాచక పాలనకు చరమ గీతం పాడి న్యాయం వైపు నిటారుగా నిలబడిన ప్రజలకు, సహకారం అందించిన సీపీఐ, టీడీపీ, టీజేఎస్, వైఎస్సార్ టీపీ పార్టీ అభిమానులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, వైస్ ఎంపీపీ కేవీరావు, ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం మండల అధ్యక్షుడు నవీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలో ఉన్న 66 బూతుల్లో ఉన్న ప్రజలు 12వేల మెజార్టీ ఇచ్చి అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లును గెలిపించారన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు తామంతా అండగా నిలబడతామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, పాలమూరు రాజు, ఆవుల సర్వేశ్వరరావు, బానోత్ లక్ష్మణ్, టౌన్ అధ్యక్షుడు శివ, ఐఎన్‌టీయూసీ వెంకటరత్నం, ఉప సర్పంచ్‌లు వెంకట్రావ్ గౌడ్, గోరంట్ల కనకయ్య, మహిళా నాయకులు కూరపాటి సౌజన్య, రామ్‌రెడ్డి, బల్లెం సురేశ్, మాదాడి రాజేశ్, రవి, రాజు, కృష్ణ, నూరుద్దీన్, ఆదిలక్ష్మి, మానస, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూఓ నరసింహారావు

దుమ్ముగూడెం: మండలంలోని తోగ్గూడెం, రాజుగుంపు, జిన్నెలగూడెం గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలను ఏటీడబ్ల్యూఓ నరసింహారావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం, రాగిజావ అందుతుందా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యకు సంబంధించి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం పాఠశాలల్లోని వివిధ రికార్డులను పరిశీలించారు. పాఠశాల హెచ్‌యం నరేందర్, ముత్తమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు కృతజ్ఞతలు

అశ్వాపురం: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి భారీ మెజారిటీ అందించిన మండల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లును భారీ మెజార్టీతో గెలిపించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ గెలుపులో కీలకపాత్ర పోషించి మద్దతు తెలిపిన టీడీపీ, సీపీఐ, టీజేఎస్, వైఎస్సార్‌టీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్ బట్టా సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదీర్, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, నాయకులు తూము రాఘవులు, వలబోజు మురళి, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాగంటి ప్రసాద్, రమేష్ బాబు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లను వితరణగా అందజేశారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత సాయిబాబా ఆలయ మాజీ అధ్యక్షుడు దివంగత మాగంటి సూర్యం జ్ఞాపకార్థ వారి కుమారులు మాగంటి ప్రసాద్, రమేష్ బాబు, మనుమడు కలిసి వృద్ధులు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సముచిత స్థానం కల్పించాలి

మణుగూరుటౌన్: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో త్వరలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వంలో గెలుపొందిన ఆదివాసులకు సముచిత స్థానం కల్పించాలని ఆదివాసీ సేన ప్రతినిధులు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ.. పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లు, ములుగు నుంచి ధనసరి సీతక్క, ఇల్లెందు నుంచి కోరం కనకయ్య, ఖానాపూర్ నుంచి వెడ్మా బొజ్జు పటేల్, అశ్వారావుపేట నుంచి జారె ఆదినారాయణలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు సోడె రవి దొర కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గనిబోయిన ముత్తయ్య, కోడి నాగరాజు, పూనెం నాగరాజు, నాగేశ్వరరావు, బండారి కృష్ణ, శ్రీను, జోగ సురేందర్ ఉన్నారు.

మెజారిటీల్లో హెచ్చుతగ్గులు

- మండలాల వారీగా అభ్యర్థుల మెజారిటీలో మార్పు
- పరపతి ఉన్న చోట భారీగా ఓట్లు



చర్ల మండలం తిప్పాపురంలో ఓటింగ్‌కు క్యూలో ఉన్న మహిళలు (ఫైల్)

అశ్వారావుపేట నియోజకవర్గం..

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోనే కాంగ్రెస్ పార్టీకి అశ్వారావుపేట మండలం నుంచి రెండో స్థానంలో మెజార్టీ దక్కింది. తాజాగా ఓట్ల లెక్కింపు, ఫలితాల వెలువడిన తర్వాత పోలింగ్ బూత్‌ల వారిగా వివిధ పార్టీలకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే, ..అత్యధిక పోలింగ్ బూత్‌లలో కాంగ్రెస్ అభ్యర్థి వైపే ఓటర్లు మొగ్గు చూపారు. నియోజకవర్గంలోనే అత్యధిక మెజార్టీ అశ్వారావుపేట మండలం నుంచే 8,454 ఓట్లు జారేకు రావడం విశేషం. మండలంలోని కొత్త నారంవారిగూడెం పోలింగ్ బూత్ నంబరు 154లో మెచ్చా నాగేశ్వరరావుకు కేవలం 94 ఓట్లు పడగా, జారేకు ఇదే బూత్‌లో 530 ఓట్లు వచ్చాయి. అలాగే అనంతారంలోని పోలింగ్ బూత్ నంబరు 180లో మెచ్చాకు 113 మాత్రమే రాగా, జారేకు 354 ఓట్లు పడ్డాయి. అదే విధంగా నందిపాడులోని పోలింగ్ బూత్ నంబరు 140లో మెచ్చాకు 115 ఓట్లు రాగా, ఇదే బూత్‌లో జారేకు 302 ఓట్లు పడ్డాయి. అత్యధికంగా గుమ్మడవల్లిలోగల 141 పోలింగ్ బూత్‌లో జారేకు 654 ఓట్లు నమోదు కాగా, ఇదే బూత్‌లో మెచ్చాకు మాత్రం 275 మాత్రమే పడ్డాయి. ఇలా ప్రతి పోలింగ్ బూత్‌లోనే కాంగ్రెస్ అభ్యర్థికే అధికంగా ఓట్లు నమోదు కావడం విశేషం. ఇదీ ఇలా ఉండగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ కంచుకోటగా ఉన్న కావడిగుండ్లలోని 184లో మెచ్చాకు అత్యధికం 411 ఓట్లు నమోదు కాగా, జారేకు మాత్రం 223 ఓట్లు మాత్రమే నమోదు కావడం గమనార్హం.

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ 28,905 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన విషయం విధితమే. కాగా నియోజకవర్గ పరిధిలోని ఒక్క దమ్మపేట మండలం నుంచే కాంగ్రెస్‌కు 11,087 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇక్కడ జారేకు 23,075 ఓట్లు నమోదు కాగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు 11,988 ఓట్లు నమోదు అయ్యాయి. మండల కేంద్రం దమ్మపేటలో కాంగ్రెస్ పార్టీకి 1442 ఓట్ల మెజార్టీ లభించింది. నాగుపల్లి గ్రామంలోని 86వ బూత్‌లో 609, ముష్టిబండ గ్రామంలోని 103వ బూత్‌లో 487, గండుగులపల్లి గ్రామంలోని 82వ బూత్‌లో 427, నాగుపల్లి గ్రామంలోని 85వ బూత్‌లో 424, అంకంపాలెం గ్రామంలోని 130వ బూత్‌లో 379 ఓట్ల మెజార్టీ జారేకు లభించింది.

అన్నపురెడ్డిపల్లి: జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీకి 1,620 ఓట్ల మెజార్టీ వచ్చింది. మండలంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జారె ఆదినారాయణకు 7399 ఓట్లు రాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు 5779 ఓట్లు వచ్చాయి. 20 పోలింగ్ బూతుల్లో పెంట్లలోని 76,77 బూతుల్లో కాంగ్రెస్‌పార్టీకి అత్యధికంగా 505 ఓట్ల మెజార్టీ వచ్చింది. మండలంలోని రాజాపురంలోని రెండు బూతులో కాంగ్రెస్‌కు 468 మెజార్టీ రాగా మర్రిగూడెం లో 280, గుంపెనలో 163,అబ్బుగూడెంలో 136 ఓట్ల మెజార్టీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి అత్యల్పంగా అన్నపురెడ్డిపల్లిలో 16 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఊటుపల్లి, భీమునిగూడెం , ఎర్రగుంటలో బీఆర్‌ఎస్ పార్టీకి మెజార్టీ వచ్చింది.

ములకలపల్లి: ములకలపల్లిలో మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి జారె ఆదినారాయణకు సమీప ప్రత్యర్థి మెచ్చా నాగేశ్వరరావుపై 4,265 ఓట్ల అధిక్యం లభించింది. మండలపరిధిలోని 34 బూత్‌లలో మొత్తం 26,278 మంది ఓటర్లు ఉండగా, 24,311 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. జారె ఆదినారాయణకు మొత్తం 12,157 ఓట్లు లభించగా, మెచ్చా నాగేశ్వరరావుకు 7,892 మంది ఓటేశారు. 34 బూత్‌లలో 5,7,11,14,25,27,29 బూత్‌లలో మాత్రమే మెచ్చాకు స్వల్ప ఆధిక్యత లభించగా, మిగిలిన 27బూత్‌లతో జారే ఆదినాయయణ మెజార్టీ సాధించారు. 22వ (గండిపోలు) బూత్‌లో జారె ఆదినారాయణకు 540 ఓట్లు పోలవ్వగా, మెచ్చాకు 143 ఓట్లు మాత్రమే దక్కాయి. ఈ ఒక్క బూత్‌లోనే జారె 397 ఓట్ల ఆధిక్యత లభించింది. ఆదినారాయణకు 1వ బూత్ (సీతారాంపురం)లో 300, 3వ బూత్ (చింతలపాడు)లో 289, 4వ బూత్ (పూసుగూడెం)లో 353, జగన్నాథపురంలో 351, 21వ బూత్ (సీతాయిగూడెం) లో 369 ఓట్ల అధిక్యత లభించడం గమనార్హం.

పినపాక నియోజకవర్గం..

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా 64 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 90వ బూత్‌లో రేగా కాంతారావుకు 390, పాయం వెంకటేశ్వర్లుకు 638, 93 బూత్‌లో 1057 ఓట్లకు గాను రేగాకు 324, పాయంకు 644, 94బూత్‌లో 1070 గానూ రేగాకు 342, పాయంకు 640, 95బూత్‌లో 1048ఓట్లు పోలవ్వగా..రేగాకు 432, పాయంకు 544, 132బూత్‌లో 1024కు గానూ రేగాకు 274, పాయంకు 690, 96బూత్‌లో 979 ఓట్లు పోలవ్వగా..రేగాకు 349, పాయంకు573 ఓట్లు సాధించారు. మండల వ్యాప్తంగా పోలింగ్ బూత్‌ల వారీగా కూడా పాయం రేగా కాంతారావుపై ఆధిక్యం సాధిస్తూ వచ్చారు. మొత్తం మీద కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు 90510 ఓట్లు సాధించి రేగా కాంతారావు(56004) పై 35,129 ఓట్ల మెజార్టీ సాధించి నియోజకవర్గ ఎన్నికల ఫలితాల్లో రికార్డ్ సృష్టించారు.

అశ్వాపురం: మండలంలో 41 పోలింగ్ కేంద్రాల్లో 37 కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుకు ఆధిక్యం రాగా నాలుగు కేంద్రాల్లోనే బీఆర్‌ఎస్ అభ్యర్థి రేగా కాంతారావుకు ఆధిక్యం వచ్చింది. ఒక్క అశ్వాపురం మండలంలోనే పాయంకు 5,554 ఓట్లు మెజారిటీ వచ్చింది. మల్లెలమడుగు గ్రామంలోని జెడ్పీ స్కూల్‌లో 161, 178, 180 మూడు పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా 706 ఓట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చింది. అశ్వాపురం ప్రైమరీ స్కూల్‌లోని 154, 155, 156 కేంద్రాల్లో కాంగ్రెస్‌కు 683 ఓట్లు ఆధిక్యం వచ్చింది. తుమ్మలచెరువులో 173, 174 రెండు కేంద్రాల్లో 595 ఓట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చింది. మొండికుంటలో 176, 177 రెండు పోలింగ్ కేంద్రాల్లో 535 ఓట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చింది. రామచంద్రాపురంలో 182, 183 రెండు కేంద్రాల్లో 419 ఓట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చింది. మండలంలో కుమ్మరిగూడెం పోలింగ్ కేంద్రంలో 111 ఓట్లు, జగ్గారం(153) కేంద్రంలో 100 ఓట్లు, గొల్లగూడెం(162) కేంద్రంలో 20 ఓట్లు, గొందిగూడెం(169) కేంద్రంలో 23 ఓట్లు పోలయ్యాయి.

భద్రాచలం నియోజకవర్గం..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సొంత మండలం కావడంతో ఒక్కసారిగా కారు పార్టీకి మెజారిటీ వేలల్లోకి చేరింది. మండలాల వారిగా చూస్తే వాజేడు మండలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి 6,789 ఓట్లు పడగా, కాంగ్రెస్ అభ్యర్థికి 7165 ఓట్లు పడ్డాయి. దీంతో ఈ మండలంలో వీరయ్య 376 మెజారిటీ సాధించారు. వెంకటాపురం మండలంలో వీరయ్యకు 8,860 ఓట్లు పడగా, తెల్లం వెంకట్రావుకు 9,039 ఓట్లు పడి 179 ఓట్ల మెజారిటీతో నిలిచారు. చర్ల మండలానికి వచ్చే సరికి మండలంలో బీఆర్‌ఎస్ తెల్లం వెంకట్రావుకు 11,101 ఓట్లు పడగా, కాంగ్రెస్ పొదెం వీరయ్యకు 11,262 ఓట్లు పడ్డాయి ఈ మండలంలో 161 ఓట్ల మెజారిటీని కాంగ్రెస్ అభ్యర్థి సాధించారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సొంత మండలమైన దుమ్ముగూడెంలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి 14,446 ఓట్లు పడగా కాంగ్రెస్ అభ్యర్థికి 9,657 ఓట్లు పడ్డాయి. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థికి 4,789 ఓట్ల మెజారిటీ సాధించారు. భద్రాచలంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావుకు 11,603 ఓట్లు పడగా కాంగ్రెస్ అభ్యర్థి వీరయ్యకు 9,848 ఓట్లు పడ్డాయి. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇక్కడ 1755 ఓట్ల మెజారిటీ సాధించారు. నియోజకవర్గం మొత్తంగా వాజేడు, చర్లలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీరయ్య స్వల్ప మెజారిటీ సాధిస్తూ రాగా.. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకటాపురం, దుమ్ముగూడెం, భద్రాచలంలో మెజారిటీ సాధించి విజయకేతనం ఎగురవేశారు. సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్య నియోజకవర్గం మొత్తంలో 5796 ఓట్లను సాధించారు.

తెల్లంకు అభినందన



కేసీఆర్‌ను కలిసిన తెల్లం వెంకట్రావు, తాతా మధు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం ఎమ్మెల్యేగా గెలిచిన బీఆర్‌ఎస్ నేత తెల్లం వెంకట్రావును ఖమ్మం జిల్లా నాయకులు అభినందించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయానికి సోమవారం ఆయన రాగా, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు పగడాల నాగరాజు, గుండాల కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన విజయానికి కృషి చేసిన తాత మధును వెంకట్రావు సన్మానించారు.

బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా..

భద్రాచలం: భద్రాచలం టికెట్‌ను తనపై నమ్మకంతో కేటాయించిన కేసీఆర్‌కు రుణపడి ఉంటానని, ప్రాణం ఉన్నంత వరకు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని తాజాగా ఎన్నికైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ స్పష్టం చేశారు. ఆయన పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన పాత ఫొటోలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా, వెంకట్రావు స్పందించారు. కొద్ది నెలల క్రితం కాంగ్రెస్‌లో చేరిన ఫొటోలను ఉద్దేశపూర్వకంగా కొందరు వైరల్ చేశారని తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ మధుతో కలిసి కేసీఆర్‌ను తెల్లం కలిశారు.

ఏఐటీయూసీని గెలిపించండి

మణుగూరుటౌన్: సింగరేణి యూనియన్ ఎన్నికల్లో కార్మికుల పక్షాన అహర్నిశలు పోరాడే ఏఐటీయూసీని గెలిపించాలని ఆ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. సోమవారం పీవీకాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 4న హైదరాబాద్‌లోని డీవైఆర్ఎల్‌సీ వద్ద సింగరేణి ఎన్నికలకు సంబంధించి యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేశారన్నారు. డిసెంబర్ 27న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో కార్మికుల ఆత్మగౌరవంగా పనిచేయడానికి కార్మికుల పక్షాన పోరాడే ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. సమావేశంలో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ మేకల ఈశ్వర్‌రావు, ముఖ్య నాయకులు ఆవుల నాగరాజు, సురేందర్, కోడి రెక్కల శ్రీనివాస్, నాగరాజు, యాకూబ్ పాష ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మణుగూరురూరల్: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శివకుమార్



కరకగూడెం: విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి దుర్గాభవాని

కరకగూడెం: ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరూ శ్రద్ధ వహించాలి కరకగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గా భవాని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం మండల పరిధిలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులని పరీక్షించారు. రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జ్వరం, దగ్గు,జలుబు తలనొప్పి వంటి లక్షణాలు ఎవరిలోనైనా ఉంటే నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. శిబిరంలో పాఠశాల హెచ్‌ఎం జగన్, ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్‌లోని బాలుర వసతి గృహంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, తడి దుస్తులు ధరించవద్దని సూచించారు. కార్యక్రమంలో రాంప్రసాద్, రవి, భవాని, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆ ముగ్గురూ అధికారానికి దూరం

అశ్వారావుపేటరూరల్: ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో ఉండి ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లోని వెళ్లి అధికార పార్టీ కాంగ్రెస్‌కు దూరమైన వారు నియోజకవర్గంలో ముగ్గురున్నారు. ఒకరు మాజీ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, మరో ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆశావాహులు కాగా, వీరిలో ఒకరు జెడ్పీటీసీ కూడా. ఈ ముగ్గురిలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు గడిచిన రెండేళ్లు కాంగ్రెస్ పార్టీలో చురుకైనా పాత్ర పోషించగా, ములకలపల్లి జెడ్పీటీసీగా ఉన్న సున్నం నాగమణి గడిచిన ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి సైతం పొందారు. అంతేకాదు ఈమె టీపీసీసీ సభ్యురాలుగా దీర్ఘకాలంగా పని చేశారు. ఇక మరొకరు టీపీసీసీ సభ్యురాలు చెప్పుకునే వగ్గెల పూజ కుడా కాంగ్రెస్ పార్టీలో గడిచిన ఏడాదిగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, అసెంబ్లీ టికెట్ ఆశావాహులుగా ఉన్నారు. ఈ ముగ్గురు అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించారు. కానీ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా ఉన్న జారే ఆదినారాయణకే అసెంబ్లీ టికెట్ దక్కింది. ఈ క్రమంలోనే జారేకు టికెట్ కేటాయించారేనే ఆవేశంలో గత నెల 13వ తేదీన దమ్మపేటలో జరిగిన ఎన్నికల ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాని ఎన్నికల ఫలితాల్లో నియోజకవర్గంతోపాటు రాష్ట్రం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో కొద్ది రోజుల వ్యవధిలోనే ఆ ముగ్గురు అధికారానికి దూరమై, ప్రతిపక్షంలోకి వెళ్లినట్టైంది. ఆవేశ నిర్ణయాలు తీసుకోకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగి ఉంటే వారి స్థాయికి తగ్గ పదవులు పొందే వారనే చర్చ సాగుతుంది.

మొక్కులు చెల్లించిన అభిమానులు



అశ్వాపురం: మొక్కులు చెల్లిస్తున్న అప్పారావు, ఎంపీపీ, నాయకులు

జారె గెలుపుతో..

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా జారే ఆదినారాయణ గెలవాలని కోరుతూ, ఇష్ట దైవాలకు మొక్కులు మొక్కిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ మొక్కులను తీర్చుకున్నారు. జారే ఆదినారాయణ కాంగ్రెస్ పార్టీ తరపున భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంగా, సోమవారం దమ్మపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ అభిమానులు, ద్వారకా తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్లారు. మండల పరిధిలోని పలు గ్రామల్లోని ఆలయాల్లో 101 కొబ్బరి కాయలు కొట్టి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని ముత్యాలమ్మ దేవత సన్నిధిలో రావికంపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోగినబోయిన కోటేశ్వరరావు సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేగా జారే ఆదినారాయణ గెలుపుతో దేవతకు మొక్కులు తీర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాయం గెలుపుతో..

అశ్వాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, పినపాక ఎమ్మెల్యేగా పాయం వెంకటేశ్వర్లు గెలవాలని మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో స్వామివారిని వేడుకున్న గ్రామానికి చెందిన ఈదర అప్పారావు సోమవారం 50 కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, నాయకులు గాదె కేశవరెడ్డి, వేములపల్లి రమేష్, ఓరుగంటి రమేష్, కొర్లకుంట కోటేశ్వరరావు, గుడవర్తి కోటేశ్వరరావు, చంద్రకళ, తుళ్లూరి వీరన్న, వాసు, రాము, బాబురావు, సంధ్య, జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కమ్మిన మబ్బులతో ఆందోళన



భద్రాచలంటౌన్: వరికోత కోస్తున్న కూలీలు



అశ్వారావుపేటరూరల్: ధాన్యం రాశులపై కప్పిన పరదాలు

అశ్వారావుపేటరూరల్: తుఫాను ప్రభావంతో సోమవారం అశ్వారావుపేటలో వర్షం కురవగా, మండలంలోని పలు గ్రామాల్లో చిరుజల్లులతో ముసురు నెలకొంది. దాంతో రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. గడిచిన కొద్ది రోజులుగా మండంలోని నారాయణపురం, నారాయణపురం కాలనీ, గుమ్మడవల్లి, ఊట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, నారంవారిగూడెంతోపాటు మరికొన్ని గ్రామాల్లో వరి పంట చేతికందగా ముమ్మరంగా వరి కోతలు చేపట్టగా, ధాన్యం రాశులను రహదారులు, ధాన్యం కేంద్రాల వద్ద ఆరబోశారు. విక్రయించేందుకు సిద్ధం ఉంచారు. ఈ నేపథ్యంలోనే తుఫాను కారణంగా చిరుజల్లులు పడటంతో రైతులంతా ధాన్యం కుప్పలపై పరదాలు కప్పారు. అదే విధంగా మల్లాయిగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం, గాండ్లగూడెం, అనంతారం, రామన్నగూడెం గ్రామాల్లో వేరుశెనగా తీతలు చేసి పొలాల్లోనే పనాలను ఆరబోశారు. తుఫాణ కారణంగా భారీ వర్షం వస్తే వేరుశెనగా, ధాన్యం రాశులు తడిసిపోయి, నష్ట పోవాల్సి వస్తుందని రైతులంతా వాపోతున్నారు.

దుమ్ముగూడెం: తుఫాను కారణంగా మండలంలో ఆకాశం మేఘాలతో కమ్మి ఉండడంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంట చేతికందే సమయంలో ఆకాశంలో మబ్బులు పట్టడంతో ఏ క్షణాన వర్షం పడుతుందో అనే భయంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మండలంలో వరి, పత్తి పంటలు చేతికి రాగా వాటిని కోసే పనిలో రైతన్నలు ఉన్నారు. వరి ధాన్యాన్ని కోసి కళ్లాల్లో ఆరబెట్టారు. అలాగే పత్తిని సైతం కోశారు. ఈ సమయంలో ఆకాశంలో మబ్బులు పట్టడంతో వర్షం పడితే పండిన పంటను రక్షించుకోవడం ఎలా అనే దానిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

దమ్మపేట: తుఫాన్ కారణంగా చిరు జల్లులతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్ష ప్రభావంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా చిరు జల్లులతో కూడిన వర్షం పడుతూనే ఉంది. ఈ తేలికపాటి వర్షం వల్ల ప్రజల రోజువారీ పనులకు అంతరాయం ఏర్పడింది. చిరు జల్లుల తాకిడికి, కల్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ధాన్యపు రాశులు తడిసిపోతాయనే భయంతో హడావిడిగా టార్పాలిన్ పట్టాలు అద్దెకు తెచ్చుకొని ధాన్యంపై కప్పారు.

అన్నపురెడ్డిపల్లి: తుఫాన్ ప్రభావంతో మండలంలో సోమవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి ఓ మోస్తారు వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోత దశలో ఉన్న వరి, పత్తి, పంటలు వర్షానికి దెబ్బతింటాయని రైతులు భయాందోళన చెందుతున్నారు. వరి కోసిన ధాన్యం రాశులు తడవకుండ టార్పాలిన్ పరదాలను కప్పి రైతులు జాగ్రత్తలను తీసుకుంటున్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో గత వారంరోజులుగా వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో బంగాళఖాతంలో ఏర్పడిన వాయిగుండం మిచాంగ్ తుఫాన్‌గా ఏర్పాడడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ సరిహద్దులో ఉండే ఉమ్మడి ఖమ్మం జిల్లాపైన తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలతో రైతుల్లో గుబులుమొదలైంది. డివిజన్ వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నుంచి మొస్తరు వర్షం పడుతుండడంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై బరకాలు కప్పేందుకు రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఉదయం వరకు మామూలుగా ఉన్న వాతావరణం సాయంత్రానికి మబ్బులు కమ్ముకుని వర్షం పడుతుంది. గాలులు వీస్తుండడంతో వరి పైరు పలు గ్రామాల్లో నేలవాలిన్నట్లు రైతులు వాపోతున్నారు. కోత మిషన్లతో కోతలు ముమ్మరంగా కోస్తుండగా పశుగ్రాసం కోసం కొందరు రైతులు అక్కడక్కడ కూలీలతో కోయిస్తున్నారు. కాగా వ్యవసాయ శాఖ అధికారులు వరి కోతలను తుఫాన్ తగ్గే వరకు వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో రైతులు సైతం ఇప్పటి వరకు కోసి ధాన్యం తడవకుండా కాపాడుతును పనిలో బిజీగా ఉన్నారు. మరోవైపు పత్తిరైతులు సైతం వర్షం కారణంగా ఆందోళన చెందుతున్నారు.



దుమ్ముగూడెం: మబ్బులు కమ్మిన ఆకాశం